PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
# సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు




మంగళవారం 15 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 105 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నివాసంలో గణపతి దర్శనం చేసుకున్న ప్రధాని మోదీ





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: గణేశ్ చతుర్థి పర్వదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నివాసానికి వెళ్లి శ్రీ గణేశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రధాని మోదీ తన అధికారిక సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. పీయూష్ గోయల్ నివాసంలో గణపతి దర్శనం చేసుకున్నానని, భగవాన్ శ్రీ గణేశుడి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. అంతకుముందు గణేశ్ చతుర్థి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, విఘ్నహర్త అయిన శ్రీ గణేశుడి దర్శనం, పూజలతో ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన శక్తి, ఉత్సాహం నిండాలని ప్రార్థించారు. భగవంతుడి దివ్య ఆశీస్సులతో ప్రజల ప్రయత్నాలన్నీ విజయవంతం కావాలని, దేశం నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ పీయూష్ గోయల్ నివాసంలో గణపతి దర్శనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ కూడా పీయూష్ గోయల్ నివాసానికి చేరుకుని గణపతిని దర్శించుకున్నట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి.

## కుటుంబ సమేతంగా గణపతి పూజ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

### వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికి సుఖశాంతులు కలగాలి: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి విజయాలను అందించే విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. గణనాథుడి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సద్భావన, మానవతా విలువలు మరింత బలపడాలని కోరుకున్నారు. ప్రజల సకల సంకల్పాలకు విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని, ప్రతి ఒక్కరికీ జ్ఞానం, ధైర్యం, సత్ప్రవర్తన ప్రసాదించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిద్దామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, అత్యంత శోభాయమానంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.




## సూర్యాపేటలో రూ.9 కోట్లతో కేంద్రీకృత వంటశాల ఏర్పాటు చేయాలని హరే కృష్ణ ఫౌండేషన్‌కు ప్రతిపాదన

సూర్యాపేట, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు చెందిన స్వామి రవి లోచన దాసతో ఈరోజు సవివరంగా సమావేశమైన సందర్భంగా సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమంపై చర్చించారు. సీఎస్ఆర్ నిధులతో కేంద్రీకృత వంటశాలలను నిర్మించి నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, పౌష్టికాహారం అందిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ దాదాపు 60 వేల పౌష్టికాహార భోజనాలను సరఫరా చేసే సామర్థ్యంతో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో ఒక కేంద్రీకృత వంటశాలను నిర్మించి నిర్వహించాలని ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. ఈ ప్రతిపాదనను అమలు చేసే విధానం, అవసరమైన మౌలిక వసతులు, సంబంధిత శాఖలు, భాగస్వాములతో సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో సవివరంగా చర్చించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖలు, భాగస్వాములతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొంటూ, మానవాళికి సేవ చేస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశం కావడం ఎల్లప్పుడూ ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు.




## తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా రామ్‌రెడ్డి సాముల ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా రామ్‌రెడ్డి సాముల ఎన్నికయ్యారు. చైర్మన్ పదవికి ముగ్గురు పోటీ చేయగా రామ్‌రెడ్డి సాములకు 12 ఓట్లు, పొన్నం అశోక్‌గౌడ్‌కు 11 ఓట్లు, హన్మంత్‌రెడ్డికి 3 ఓట్లు లభించాయి. దీంతో సమీప ప్రత్యర్థి పొన్నం అశోక్‌గౌడ్‌పై ఒక్క ఓటు ఆధిక్యంతో రామ్‌రెడ్డి సాముల చైర్మన్‌గా విజయం సాధించారు. అశోక్‌గౌడ్ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోదరుడు కాగా, కాంగ్రెస్ లీగల్ సెల్‌లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా వెంకట్ యాదవ్ చలకాని ఎన్నికయ్యారు. ఈ పదవికి ముగ్గురు పోటీ చేయగా వెంకట్ యాదవ్‌కు 13 ఓట్లు, జకీర్ హుస్సేన్ జావెద్‌కు 10 ఓట్లు, రామారావు గోకుల్‌కు 3 ఓట్లు లభించాయి. దీంతో తన సమీప ప్రత్యర్థిపై మూడు ఓట్ల ఆధిక్యంతో వెంకట్ యాదవ్ విజయం సాధించారు. ఆయన గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా కిరణ్‌కుమార్ గన్నమనేని ఎన్నికయ్యారు. ఈ పదవికి ఐదుగురు పోటీ చేయగా కిరణ్‌కుమార్‌కు 10 ఓట్లు, డి. జగదీశ్వర్‌రావుకు 7, పాశం సుజాతకు 4, ఆకుల అనంతసేన్‌రెడ్డికి 3, అనిల్ కిరణ్‌కుమార్‌కు 2 ఓట్లు లభించాయి. దీంతో జగదీశ్వర్‌రావుపై మూడు ఓట్ల ఆధిక్యంతో కిరణ్‌కుమార్ గన్నమనేని గెలుపొందారు. ఆయన బీఆర్ఎస్ లీగల్ సెల్‌లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్‌కు 2018లో ఎన్నికలు జరగగా, ఆ తర్వాత కొత్త కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలో జాప్యం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో 2026 జనవరి 30న రాష్ట్రవ్యాప్తంగా బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 203 మంది న్యాయవాదులు పోటీ చేసిన ఈ ఎన్నికల్లో 23 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. మహిళలకు 30 శాతం ప్రాతినిధ్యం కల్పించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఐదుగురు మహిళలు ఎన్నిక కాగా, మరో ఇద్దరు మహిళా సభ్యులను నామినేట్ చేశారు.

## సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా.. 250 కంపెనీలతో వేలాది ఉద్యోగ అవకాశాలు




కోదాడ, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడలో సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి తెలిపారు. సూర్యాపేట జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ భారీ నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 200 నుంచి 250 కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ విద్యార్హతలు కలిగిన విద్యార్థులు, యువతను నియామక ప్రక్రియకు ప్రత్యేకంగా సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలకు అనుగుణంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలని వారు సూచించారు. కోదాడలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ వేదికగా ఈ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పోఖ్రాన్‌లో ఐఏఎఫ్ 'డ్రోనథాన్-2026' ప్రారంభం.. డ్రోన్, కౌంటర్ డ్రోన్ సాంకేతికతల ప్రదర్శన



జైసల్మేర్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత వాయుసేన తొలిసారిగా నిర్వహిస్తున్న 'డ్రోనథాన్-2026' కార్యక్రమం రాజస్థాన్‌లోని జైసల్మేర్ పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ప్రారంభమైంది. సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని వాయుసేన వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ ప్రారంభించారు. దేశ రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా మానవరహిత వైమానిక వ్యవస్థల సామర్థ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దేశీయ రక్షణ సంస్థలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, డీపీఎస్‌యూలు, సాంకేతిక ఆవిష్కర్తలు తమ డ్రోన్, కౌంటర్-డ్రోన్ వ్యవస్థలను పోఖ్రాన్‌లో ప్రత్యక్షంగా ప్రదర్శిస్తున్నారు. నిఘా, గూఢచర్యం, స్వయంచాలక కార్యకలాపాలు, డ్రోన్ స్వార్మ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, కౌంటర్-యూఏఎస్ వంటి కీలక సాంకేతికతలను ఈ ప్రదర్శనల్లో పరీక్షిస్తున్నారు. సవాళ్లతో కూడిన వాస్తవిక పరిస్థితుల్లో ఆయా వ్యవస్థల పనితీరు, విశ్వసనీయత, సమర్థతను అంచనా వేయడంతో పాటు భవిష్యత్ రక్షణ అవసరాలకు అనుగుణంగా దేశీయంగా అభివృద్ధి చేయగల సాంకేతిక పరిష్కారాలను గుర్తించేందుకు డ్రోనథాన్-2026 దోహదపడనుంది. కార్యక్రమంలో భాగంగా ఐఏఎఫ్ 'అన్‌మ్యాన్డ్ అండ్ అటానమస్ సిస్టమ్స్ రోడ్‌మ్యాప్'ను కూడా ఆవిష్కరించింది. మానవ సహిత, మానవరహిత వైమానిక వ్యవస్థలను సమన్వయంతో వినియోగించే భవిష్యత్ రక్షణ సామర్థ్యాల అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోంది.



## చంద్రశేఖర్ మహారాజ్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం సంస్కృత పండిత్ పురస్కారం

కంగ్టి, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: వార్కరీ సంప్రదాయాన్ని అనుసరిస్తూ వివిధ రాష్ట్రాల్లో తన ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా ప్రజలను భక్తి, ఆధ్యాత్మిక చింతన వైపు నడిపిస్తున్న దెగ్లూర్ గుండా మహారాజ్ పీఠాధిపతి హరిభక్త పారాయణ్ చంద్రశేఖర్ మహారాజ్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రాచీన సంస్కృత పండిత్ పురస్కారం ప్రకటించింది. వేదాంతం, ఉపనిషత్తులు, భగవద్గీతతో పాటు సంత్ జ్ఞానేశ్వర్, సంత్ తుకారాం మహారాజ్ బోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను తన ప్రవచనాల ద్వారా ప్రజలకు చేరువ చేస్తూ ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సమాచారం. మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తూ భక్తుల్లో ధార్మిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు చంద్రశేఖర్ మహారాజ్ చేస్తున్న కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. చంద్రశేఖర్ మహారాజ్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రకటించడంతో ఆయన శిష్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## 11 ఏళ్లుగా MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా 11వ ఏడాది ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని న్యూ మార్కెట్ వద్ద భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. గత 11 ఏళ్లుగా MDR ఫౌండేషన్ పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న భక్తులకు ఫౌండేషన్ కార్యాలయంలో విగ్రహాలను అందజేయడంతో పాటు స్థానిక ప్రజలకు కూడా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ కార్యక్రమానికి సహకరించిన స్థానిక ప్రజలకు, మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం



సూర్యాపేట, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన దివంగత నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి భౌతికంగా దూరమైనా సమాజం కోసం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, దామోదర్ రెడ్డి సేవా స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని, రక్తదానం మహోన్నతమైన సేవగా భావించాలని పేర్కొన్నారు. ప్రజలే కుటుంబంగా భావించి సేవను జీవిత ధ్యేయంగా చేసుకున్న దామోదర్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమం ఆయన సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది తదితరులు పాల్గొన్నారు.




## సూర్యాపేటలో ఒకేరోజు భక్తి.. అభిమానం.. గణేష్ చవితి, దామోదర్ రెడ్డి జయంతితో సందడి



సూర్యాపేట, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: సూర్యాపేట పట్టణంలో ఒకేరోజు వినాయక చవితి ఉత్సవాలు, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి జయంతి వేడుకలు జరగడంతో పట్టణంలో భక్తి, అభిమానం కలగలిసిన ప్రత్యేక వాతావరణం నెలకొంది. ఒకవైపు వినాయక చవితి సందర్భంగా వీధివీధినా గణేష్ మండపాలు భక్తులతో సందడిగా కనిపించగా, మరోవైపు దామోదర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు, ఆత్మీయులు, అనుచరులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. గణనాథుడి పూజలు, భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణంతో పట్టణంలోని పలు ప్రాంతాలు కళకళలాడగా, దామోదర్ రెడ్డి జయంతి వేడుకలు అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. రెండు వేడుకలు ఒకేరోజు రావడంతో సూర్యాపేట పట్టణ ప్రజల సందడికి మరింత ప్రత్యేకత ఏర్పడింది. గణేష్ మండపాల వద్ద భక్తుల రద్దీ, జయంతి వేడుకల వద్ద అభిమానుల హాజరుతో పట్టణంలో ఉదయం నుంచి సందడి నెలకొంది. ఒకవైపు భక్తి భావన, మరోవైపు నాయకుడిపై అభిమానం, ఆత్మీయతను ప్రతిబింబించేలా సాగిన ఈ రెండు వేడుకలు సూర్యాపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి: ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసిన గణేశ్ మండపాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, జిల్లా ప్రజలకు వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది పరస్పరం సహకరించుకుంటూ ఐకమత్యం, సమన్వయంతో విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని, ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మద్దూం అలీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, నారాయణరాజు, జానయ్య, ఆర్‌ఎస్సైలు అశోక్, సాయిరాం, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నందిగామ, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: అప్పుల భారం తాళలేక సిద్దిపేట జిల్లా నందిగామకు చెందిన బిజ్జి దాసు (50) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న దాసు కుటుంబ అవసరాలు, పిల్లల వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఆందోళనకు గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 7న హైదరాబాద్ నుంచి నందిగామకు వచ్చిన ఆయన ఆదివారం తన గుడిసెలో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. [illegible]డి కుటుంబ సభ్యులు, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటూ ఘటనకు దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నారాయణఖేడ్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండల కేంద్రానికి చెందిన అల్లాపురం సాయిలు అనారోగ్యంతో వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.17,000 ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కును లబ్ధిదారుడికి స్వయంగా అందించి, అనారోగ్యంతో బాధపడుతున్న సాయిలుకు అవసరమైన సహాయం అందడం పట్ల ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ సంగప్ప, వార్డు సభ్యులు బాలయ్య, నాయకులు బాలయ్య, నర్సింహారెడ్డి, హనుమంత్‌రావు, పండరి సాయి, చందయ్య తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి పుష్పాలు సమర్పించి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అందులో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, చింత సాయినాథ్, కొండల్ రెడ్డి, విఠల్, జీవీ శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, శ్రవణ్ రెడ్డి, హరి ప్రసాద్, రవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముర్కుంజాల్‌లో పిచ్చి మొక్కల నివారణకు పిచికారీ

కంటి, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: కంటి మండల పరిధిలోని ముర్కుంజాల్ గ్రామంలో పిచ్చి మొక్కల నివారణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. సర్పంచ్ సారంగి అనూష లాల్ కుమార్ పర్యవేక్షణలో గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రాథమిక పాఠశాల ఆవరణ, రహదారుల వెంట, పరిసర ప్రాంతాల్లో విస్తరించిన పిచ్చి మొక్కల నివారణకు గడ్డి మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామంలోని ప్రధాన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.



# కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్.. భార్యాభర్తలకు గాయాలు

నిజాంపేట, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: నిజాంపేట మండల కేంద్రంలో కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నారాయణఖేడ్ నుంచి దుబ్బాక వైపు వెళ్తున్న ఓ కుటుంబం ప్రయాణిస్తున్న బైక్‌కు కుక్కలు అకస్మాత్తుగా అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు వారి కుమారుడికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న 108 అత్యవసర సేవల సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కల బెడదను నియంత్రించడంతో పాటు రహదారులపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.



# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హరిత ఎంపిక

నారాయణఖేడ్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: కృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సీహెచ్. హరిత సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. పటాన్‌చెరులో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి హరిత రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 26, 27 తేదీల్లో వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. హరితకు కబడ్డీలో శిక్షణ అందించిన పీఈటీ రాములును గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వినాయక చవితికి వైభవంగా ముస్తాబైన తుంబురీశ్వర ఆలయం



టేక్మల్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మల్ మండలంలోని వెలుగొండ గ్రామంలో కాకతీయుల కాలం నాటి నల్లరాతితో నిర్మించిన తుంబురీశ్వర ఆలయం వినాయక చవితి సందర్భంగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గ్రామంలోని వ్యాపార కేంద్రం సమీపంలో ఉన్న వినాయక విగ్రహానికి నిత్యం భక్తులు పూజలు నిర్వహిస్తుండగా, వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ నిర్మాణంలో కనిపించే కాకతీయుల కాలం నాటి శిల్పకళా నైపుణ్యం నేటికీ చూపరులను అబ్బురపరుస్తోంది. ప్రాచీన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో పండుగ సందర్భంగా భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రూ.9.41 లక్షల బీమా చెక్కు అందజేత



తూప్రాన్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మెదక్ జిల్లా తూప్రాన్ కేంద్రంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో బీమా క్లెయిమ్ చెక్కును నామినీకి అందజేశారు. మాసాయిపేట మండలం బొమ్మరం గ్రామానికి చెందిన ముట్టెల నాగరాజ్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన నామినీ ముట్టెల నరసింహులుకు రూ.9,41,461 బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును సుచిత్ర బ్రాంచ్‌లో అందజేశారు. బీమా సంస్థ నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేసి ఈ మొత్తాన్ని అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్లు కుమ్మరి యాదగిరి, నర్సింలు, బ్రాంచ్ మేనేజర్ రవి, జోనల్ మేనేజర్ సురేష్, రీజనల్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు బ్రాంచ్ ఉద్యోగులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు ఎద్దు మృతి



నర్సాపూర్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ వి. సాయి ప్రతినిధి: నర్సాపూర్ మండలం గూడెం గడ్డ గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడటంతో భాస్కర్‌కు చెందిన జత ఎడ్లలో ఒకటి మృతి చెందింది. దీంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు కుటుంబం తెలిపింది. పిడుగుపాటుతో పశువును కోల్పోయిన భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## రాళ్ల కుప్పల మధ్య భక్తుల బాట.. బురద రోడ్డుతో కాలనీవాసుల అవస్థలు

నర్సాపూర్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ వి. సాయి ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గంలోని పోస్టాఫీస్ నుంచి సినిమా థియేటర్ మీదుగా కుమ్మరివాడకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రెండు నెలల క్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రహదారిని తవ్వి పైపులు ఏర్పాటు చేసిన అనంతరం మట్టిని సక్రమంగా పూడ్చకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. పలుచోట్ల రాళ్ల కుప్పలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వినాయక చవితి సందర్భంగా కాలనీలో నవరాత్రి వేడుకలు నిర్వహించేందుకు భక్తులు రాకపోకలు సాగించాల్సి ఉండగా, రహదారి పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో వాహనదారులు, పాదచారులు జారిపడే ప్రమాదం ఉందని, అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు మరింత ఇబ్బంది కలిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి మరమ్మతులు చేపట్టి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## కాసాల వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో సాగిన అభిషేకం



నర్సాపూర్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ వి. రాజా ప్రతినిధి: కాసాల గ్రామంలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో కొలువుదీరిన సింధూర వర్ణంలో ఉన్న వినాయక విగ్రహానికి అర్చకులు అభిషేకం నిర్వహించి, సింధూరంతో అలంకరించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ, పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళా భక్తులు మంగళహారతి నిర్వహించగా, చిన్నారులు, పెద్దలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారిని ప్రార్థించారు. స్థానికుల కథనం ప్రకారం వరసిద్ధి వినాయక ఆలయం గ్రామానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగి ఉందని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. వినాయక చవితి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

## మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



మెదక్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. మెదక్ జిల్లాలో ప్రజలు పరస్పర సోదరభావం, ఐక్యతతో పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, యువత పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, గణేష్ నిమజ్జన శోభాయాత్రను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. భక్తిశ్రద్ధలు, సామరస్యంతో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ పిలుపునిచ్చారు.



## నర్సాపూర్‌లో థింక్ గురు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రారంభం

నర్సాపూర్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ వి. సాయి ప్రతినిధి: నర్సాపూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన థింక్ గురు ఓవర్సీస్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, అవసరమైన సమాచారం అందించేందుకు ఇలాంటి కన్సల్టెన్సీ సంస్థ నర్సాపూర్‌లో ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ విద్యా, కెరీర్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విదేశీ విద్యకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా ప్రారంభమైన సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గురుకుల బాలికల కళాశాలలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

అందోల్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: అందోల్ మండలంలోని గురుకుల బాలికల కళాశాలలో వినాయక చవితి వేడుకలను విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, పూలతో సుందరంగా అలంకరించి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేడుకల నిర్వహణలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది విద్యార్థినులకు సహకరించారు. విద్యార్థినులు, అధ్యాపకులు సమష్టిగా పాల్గొనడంతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తి, సంప్రదాయం, ఐక్యతను చాటుతూ నిర్వహించిన వినాయక చవితి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

## మరవెల్లిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



వట్పల్లి, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. రాష్ట్ర మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి స్వామి సూచనల మేరకు, మాజీ సర్పంచ్ మఠం శోభారాణి, సంతోషం స్వామి ఆధ్వర్యంలో గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని నిర్వాహకులు సూచించారు. మట్టి వినాయక విగ్రహాలతో పూజలు నిర్వహించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సంతోషం స్వామి, మేడుకుంద కిరణ్, మధు, శేఖర్, మానేయ్య, వీరన్న, యాదప్ప, నాగరాజు, సంగమేష్, అల్లాదుర్గం సంగన్నతో పాటు పలువురు గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు. గ్రామంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడంపై స్థానికులు నిర్వాహకులను అభినందించారు.

## గడిపెద్దాపూర్‌లో వైభవంగా వినాయక పర్వదిన వేడుకలు



అల్లాదుర్గం, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: వినాయక పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. పర్వదినం సందర్భంగా ఉదయం గణపతికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం పత్రి పూజ చేపట్టనున్నారు. తర్వాత శ్రీ మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దివ్యదర్శనం కల్పించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొనేలా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



# కొలువుదీరిన గణనాథుడు.. నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

జహీరాబాద్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని వాడవాడలా గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు భక్తులతో సందడిగా మారాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. పలు మండపాల్లో పూజారులు శాస్త్రోక్తంగా గణపతి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వినాయక చవితి విశిష్టత, గణపతి ఆరాధన ప్రాధాన్యత, పండుగకు సంబంధించిన ఆధ్యాత్మిక అంశాలను భక్తులకు వివరించారు. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో వినాయక మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలిచి స్వామివారి ఆశీస్సులు పొందాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. దీంతో జహీరాబాద్ పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమాల్లో పవన్ కుమార్, నందిని పాటిల్, గౌతమ్ సిద్ధార్థ, నవ్య పాటిల్, సిద్విలాసిని తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు సాయుధ దళ కార్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథునికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ దంపతులు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి పుష్పాలు, పండ్లు సమర్పించి ప్రత్యేక హారతి ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు శ్రీ గణేశుడు జిల్లా ప్రజలందరికీ, పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజా రక్షణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ధైర్యం, శక్తి, మానసిక ప్రశాంతత ప్రసాదించాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు నెలకొనాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర సోదరభావం, ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ నరేందర్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ రెడ్డి, రాము నాయుడు, మహేష్ గౌడ్, నాయిముద్దీన్, సుమన్ కుమార్, ఆర్‌ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్ రావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిప్పులు చెరిగిన కడప రెడ్డమ్మ.. ఆసియా కప్ విజేతగా భారత్




దుబాయ్, సెప్టెంబర్ 15 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మహిళల ఆసియా కప్-2026లో భారత మహిళల జట్టు సత్తా చాటింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో శ్రీలంకను 72 పరుగుల తేడాతో ఓడించి రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు సాధించింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన అద్భుత బ్యాటింగ్‌తో భారత ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించారు. షెఫాలీ వర్మ 39 బంతుల్లో 68 పరుగులు, స్మృతి మంధాన 39 బంతుల్లో 59 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వీరిద్దరూ కలిసి 129 పరుగుల భాగస్వామ్యంతో శ్రీలంక బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. అనంతరం 184 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక భారత స్పిన్నర్ల ధాటికి నిలువలేక 111 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయానికి కడపకు చెందిన భారత యువ బౌలర్ శ్రీచరణి కీలకంగా నిలిచింది. అద్భుతమైన బౌలింగ్‌తో కేవలం 20 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్ పతనంలో ప్రధాన పాత్ర పోషించింది. మరోవైపు దీప్తి శర్మ మూడు వికెట్లు తీసుకుని శ్రీచరణికి చక్కటి సహకారం అందించింది. దీంతో బ్యాటింగ్‌లో షెఫాలీ, మంధాన జోరుకు తోడు బౌలింగ్‌లో శ్రీచరణి, దీప్తి శర్మ విజృంభణతో భారత్ ఫైనల్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. టోర్నీ మొత్తం అజేయంగా సాగిన భారత జట్టు మరోసారి ఆసియా క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుతూ ఎనిమిదోసారి మహిళల ఆసియా కప్‌ను ముద్దాడింది.

# పోసానిపేట ప్రజలకు బావ బామ్మర్దుల వినాయక చవితి శుభాకాంక్షలు






